నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

క్లుప్తంగా

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



పట్నంబజారు: గుంటూరు నగర ప్రజలకు వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో మెలగాలని ఆకాంక్షించారు. దేవుని ఆశీస్సులతో సంపూర్ణమైన బంగారు భవిష్యత్ కలగాలని కోరారు.

కన్న స్కూల్లో 'గ్రీన్ కలర్ డే'



గుంటూరు ఎడ్యుకేషన్: రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో మంగళవారం గ్రీన్ కలర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దుస్తులు ధరించి, ఆకు కూరలు, కూరగాయలు, పండ్లతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించటంతో పాటు ఉపన్యాసాలు, నృత్యరూపకాలు, ప్రదర్శించారు. ఈ సందర్భంగా కన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కన్న మాస్టారు మాట్లాడారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



నగరంపాలెం: ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం సన్మానించారు. తుళ్లూరు పీఎస్ ఎస్‌ఐ కె.శివప్రసాదరావు, తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్ కానిస్టేబుల్ ఎంఎస్‌వీ ప్రసాదరావు మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ మేరకు ఇద్దరిని జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ(ఏఆర్) ఎ.హనుమంతు, ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో గ'లీజు' వ్యవహారంపై సీరియస్

చెక్కులు ఎప్పుడు ఇచ్చారనే అంశంపై కమిషనర్ ఆరా..

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో చాలా వరకు లీజు గడువు పూర్తయ్యాయి. వీటిలో స్వాధీనం చేసుకోవాలని, లేని పక్షంలో రెన్యువల్ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేయడంతో రెవెన్యూ అధికారులు ఇదే అదునుగా రెన్యువల్స్ పేరుతో దోపిడీ తెర తీశారు. లీజుదారులు సకాలంలో చెక్కులు అందజేసినప్పటికి వాటిని సకాలంలో పోస్టింగ్ వేయకుండా షాపునకు సంబంధించి అద్దె, వడ్డీ లక్షల్లో పెరిగిపోయిందని చెప్పడం .. అంత ఇవ్వలేకుంటే మాకు కొంత ఇస్తే దానిని మాఫీ చేస్తామని లీజుదారులకు చెప్పడంతో లీజుదారులు చేసేదేమి లేక రెవెన్యూ సిబ్బందికి ముడుపులు ఇచ్చుకుని లీజుకు సంబంధించిన వడ్డీని మాఫీ చేస్తున్నారు. దీనిపై గత ఆదివారం 'సాక్షి'లో 'కార్పొరేషన్‌లో గ'లీజు' వ్యవహారం' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం నిర్వహించిన రెవెన్యూ మీటింగ్‌లో చెక్కుల పోస్టింగ్ వ్యవహారం, వడ్డీ మాఫీ వ్యవహారంపై సీరియస్ అయినట్లు సమాచారం. ఇందులో భాగంగా షాపు లీజుదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించడంతో, మంగళవారం కౌన్సిల్ సమావేశంలో లీజుదారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశమయ్యారు. మీరు చెక్కులు ఎప్పుడు ఇచ్చారు. ఎప్పుడు సర్దుబాటు చేశారు. వడ్డీ ఎంత పడింది అనే అంశాలను లీజుదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో కొన్ని అవకతవకలు జరిగినట్లు తేలడంతో సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునేందుకు కమిషనర్ సిద్ధమవుతుండడంతో రెవెన్యూ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



షాపింగ్ కాంప్లెక్స్ లీజుదారులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

నగరంలో తాగునీటి సరఫరాలో ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అనధికార నీటి విక్రయాలకు అడ్డుకట్ట వేయకుంటే చర్యలు తప్పవని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కమిషనర్ లాడ్జి సెంటర్‌లోని హెచ్‌ఎల్‌ఆర్ ట్యాంక్, ఎస్‌వీఎస్ కాలనీ, జేకేసీ కాలేజ్ రోడ్, శ్యామలా నగర తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత హెచ్‌ఎల్‌ఆర్‌లో నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి వస్తున్న నీరు, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాల రిజర్వాయర్లకు సరఫరాని అడిగి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, ఇంటింటి చెత్త సేకరణ, గ్యాంగ్ వర్క్ ద్వారా డ్రెయిన్లు క్లీన్ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. శ్యామల నగర్‌లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాన్ని పరిశీలించి, సెట్ బ్యాక్, రోడ్డు కొలతలు, ర్యాంప్‌లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కృష్ణ నగర్‌లో మున్సిపల్ స్కూల్‌ని పరిశీలించి, స్కూల్ మరమ్మతుల వివరాలు తెలుసుకున్నారు. పర్యటనలో ఎస్‌ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరావు, మధుసూధన్ పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు



నగరంపాలెం: జిల్లా కోర్టు ఆవరణలో గుంటూరు బార్ అసోసియేషన్, వైఎస్సార్ సీపీ మహిళా న్యాయవాదులు ముందస్తు నూతన సంవత్సర వేడుకలు మంగళవారం క్యాంటీన్ వద్ద నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మరెడ్డి పాల్గొన్నారు. సీనియర్ మహిళా న్యాయవాదులు మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలపై అనేక కేసులు నమోదు చేశారని, వాటిని ధైర్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. వారిని న్యాయపరంగా ఆదుకుంటామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజా పరిపాలన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుంటామని అన్నారు. జూనియర్ న్యాయవాదులకు ఉపకార వేతనం ఐదు వేల నుంచి పది వేలకు పెంచుతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చి ఆరు నెలలు గడిచినా ఫలితం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు జూనియర్ న్యాయ వాదులకు ఉపకార వేతనాల కింద ఐదు వేలు చొప్పున ప్రతినెలా అందించారని గుర్తుచేశారు. బార్ కౌన్సిల్‌కు సంబంధించి రూ.100 కోట్లు మంజూరు చేశారని, అయితే చంద్రబాబు నెలలు దాటినా న్యాయవాదులకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. అబద్ధాల సీఎంగా త్వరలో చంద్రబాబు నిలిచిపోతారని అన్నారు. న్యాయవాదులు పుష్ప, వాణి, మాధవి, మంజుల, ఝాన్సీ, శ్యామల, వరదాయిని, విజయ, సోనీ, వెంకటరమణ, ప్రసన్నలక్ష్మి, తిరుపతమ్మ, దయానా పాల్గొన్నారు.

లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, ఎమినిటి కార్యదర్శులు లబ్ధిదారులతో జియో ట్యాగ్ చేయించడంలో ప్రత్యేక చొరవ చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లతో హౌసింగ్ లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారిగా ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను లే అవుట్ల వారీగా ఎమినిటి కార్యదర్శులను, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ లే అవుట్స్‌లో నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు ఇచ్చిన టైం లైన్ మేరకు పనులు పూర్తి చేయాలని కోరారు. నిర్మాణ పనులకు అవసరమైన గ్రావెల్‌కు తగిన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. సొంతంగా నిర్మాణం చేసుకునే వారు త్వరగా చేసుకునేలా ఎమినిటి కార్యదర్శులు తోడ్పాటుని అందించాలన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన వాటికి సంబంధించి బిల్లుల ఆన్ లైన్ ఎమినిటి కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయాలని, జాప్యం చేయవద్దని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ సిహెచ్.ఓబులేసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, హౌసింగ్ ఈఈ శంకరరావు, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా మహిళ విభాగం నూతన సంవత్సర 2025 క్యాలెండర్‌ను మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షాఖాదరి, మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు పి.హేమలత, ప్రధాన కార్యదర్శి సుమిత్రా దేవి, ఉపాధ్యక్షురాలు మల్లేశ్వరి, సుధామధు, సహ అధ్యక్షురాలు సంధ్యారాణి, వెంకటరమణ, కళ్యాణి గౌరి, షబానా సుల్తానా, రోజారాణి, అరుణకుమారి పాల్గొన్నారు.

కుల గణన జాబితాల సవరణ గడువు పొడగింపు

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కుల గణన జాబితాలో సవరణలకు జనవరి 7వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పూర్తయిన కుల గణన జాబితాలను ఈ నెల 26న నగరంలోని 206 వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో సందర్శనార్థం ప్రకటించడం జరిగిందన్నారు. నగర ప్రజలు సర్వే రిపోర్ట్‌లోని తమ వివరాలు సరిగా ఉన్నాయో, లేదో చెక్ చేసుకోవచ్చని తెలిపారు. పేర్లు, సబ్ క్యాస్ట్ కేటగిరి వివరాలు తప్పుగా ఉన్నా లేదా ఏమైనా అభ్యంతరాలు ఉన్నా డిసెంబర్ 31వ తేదీలోగా అర్జీలు అందజేయవచ్చని ప్రభుత్వం గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రజలకు మరింత గడువు ఇచ్చేందుకు జనవరి 7వ వరకు గడువు పెంచడం జరిగిందన్నారు. 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా స్థానిక సచివాలయంలో అడ్మిన్ కార్యదర్శి, వీఆర్‌ఓలకు లిఖిత పూర్వకంగా అర్జీలు అందించవచ్చని తెలిపారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో విచారించి, విచారణ మేరకు తుది జాబితాలో నమోదు చేస్తామన్నారు.

నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ట్రావెలర్స్ బంగ్లా, జీజీహెచ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ టెస్టింగ్ పాయింట్స్‌ని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్)లో భాగంగా గుంటూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యటనలో ఎస్‌ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు అభివృద్ధికి కృషి చేద్దాం

లక్ష్మీపురం: గుంటూరు అభివృద్ధికి కృషి చేద్దామని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేట అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సమావేశం నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షులు పి.ఎస్ మూర్తి మాట్లాడారు.

బీజేపీ నాలుగో మండల అధ్యక్షుడిగా తిరుమలరావు

గుంటూరు మెడికల్: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నాలుగో మండల అధ్యక్షుడిగా వక్కలగడ్డ తిరుమలరావును ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక అరండల్‌పేట 6వలైనులోని కార్యాలయంలో మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. నూతనంగా మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుమలరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

షిప్ ఫౌండేషన్‌కు సహాయ, సహకారాలు అందిస్తాం

– డాక్టర్ షమా సుల్తానా



గుంటూరు రూరల్: షిప్ ఫౌండేషన్‌లో ఉన్న హెచ్‌ఐవీ పేషెంట్లకు హోప్ విన్ హాస్పిటల్స్‌లో ఉచిత ఓపీ ద్వారా సేవలు అందిస్తామని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమా సుల్తానా తెలిపారు. మంగళవారం అమరావతిరోడ్డు గోరంట్ల హోసన్న మందిరం సమీపంలోని సొసైటీ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ హెచ్‌ఐవి ఇన్ఫెక్టెడ్ పీపుల్ (షిప్) ఫౌండేషన్‌లో ఉన్న 250 మంది హెచ్‌ఐవీ పేషంట్లకు బట్టలు, బెడ్ షీట్స్, భోజనం హోప్ విన్ హాస్పిటల్స్, సలాం నమస్తే గుంటూరు సొసైటీ (ఎస్టీఓ) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సుమారు 6 వేల మంది పేషెంట్లను అక్కున చేర్చుకున్న షిప్ ఫౌండేషన్ నిర్వాహకులను ఆమె అభినందించారు. హెచ్‌ఐవీ బాధితులకు విశేష సేవలందిస్తున్న షిప్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రమాదేవిని డాక్టర్ షమా సుల్తానా మెమెంటో అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) కె.విజయలక్ష్మి, బాజీబి, శ్రీదేవి పాల్గొన్నారు.